**చిన్నప్పుడు నాకు స్నేహితులకన్నా.. సహచరులే ఎక్కువ. 'ఎస్ బాస్!' గాళ్లకు లెక్కేలేదు. అక్కకు మటుకు చాలామంచి జీవితకాలపు స్నేహితులున్నారు. అసలు మొదట అక్కా, నేనూ మంచి స్నేహితులం. మా ఇద్దరి మధ్యా వయసు తేడా రెండేళ్లే అవడం ఇందుకు ఒక కారణమై ఉండొచ్చు.**

# స్నేహ పర్వం

సుత్తి లేకుండా చెప్పాలంటే.. నా స్నేహితులూ, అక్క స్నేహితులూ కలసి వెరసి మా ఇద్దరికీ కామన్ ఫ్రెండ్స్ అన్నమాట. అక్కకు ఆరో తరగతిలో ఇంద్రాణితో స్నేహం మొదలైంది. అక్క క్లాస్‌మేట్స్ అందరూ నాకు తెలుసు. వాళ్లపేర్లు ధనలక్ష్మి, సుజాత, లలిత, రాజమణి, సౌభాగ్యం, సరళ.. ఇలా ఉండేవి గానీ, ఈ ఇంద్రాణి అన్న పేరు చాలా ప్రత్యేకంగా అనిపించింది. వాళ్ల అన్నయ్యా, తనూ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నపెండ్యాల నుంచి రిక్షాలో స్కూల్‌కు వచ్చేవారు. అంటే 'శభాష్ రాముడు' సినిమాలో ఎన్టీఆర్‌లా వాళ్లే రిక్షా తొక్కుకుంటూ చదువుకున్నారని కాదు. రిక్షా వాళ్ల సొంతమే గానీ, దాన్ని తొక్కడానికి ఒకాయన్ని జీతానికి పెట్టుకున్నారు. 'ఇంద్రాణి స్కూల్‌కు రిక్షాల వొస్తదట!' అంటూ ఆడపిల్లలు చెప్పుకొనేవారు. చుట్టుపక్కల ఊర్ల నుంచి ఆడపిల్లలూ, మగపిల్లలూ.. కొందరికి కాళ్లకు చెప్పులు కూడా లేకుండా వచ్చే రోజుల్లో.. రిక్షాలో రావడం లగ్జరీనే మరి! అందుకని కూడా తను స్పెషల్‌గా అనిపించేది. అప్పుడప్పుడూ గేమ్స్ పీరియడ్‌లో స్కూల్ గ్రౌండ్‌లో 'వామ్మో.. వాయ్యో!' అనుకుంటూ ఆ రిక్షా తొక్కడం మాకో సరదా! పరీక్షల రోజుల్లోనూ, వాళ్లమ్మ ఊర్లో లేనప్పుడూ ఇంద్రాణి మా ఇంట్లో ఉండేది. ఆ సమయాల్లో మా మధ్య గాఢమైన స్నేహం అల్లుకుంది. నేను వాళ్లకు మ్యాథ్స్ చెప్పేదాన్ని. ''మా చెల్లె మస్తు బనాయిస్తది. కొంచెం జాగ్రత్త ఇందూ!'' అని మా అక్క తనకు చెప్పింది. అయితే, ఇంద్రాణి బాగా స్పోర్టివ్‌గా ఉండేది. తను వారం పదిరోజులుండి వెళ్లిపోయాక చెప్పరానంత దిగులేసేది.

మేము అన్ని ఆటలతోపాటు షటిల్ ఆడేవాళ్లం. ఆ బ్యాట్ మోయడానికే కష్టపడుతూ.. ''అబ్బ! దీన్నెట్ల పట్టుకోవాలె రమా! చెయ్యి గుంజుతున్నది'' అనే ఇంద్రాణిని అచ్చం అలాగే ఇమిటేట్ చేస్తే బాగా నవ్వేది. అక్క, తను.. ఇద్దరూ హిందీలో వీక్. ఒకసారి తన నోట్‌బుక్‌లో 'పి.ఇంద్రణీ జీ' అని హిందీలో తనపేరు రాసుకోవడం చూసి.. ''పి.ఇంద్రణీ జీ! మిమ్మల్ని అమ్మ భోజనానికి పిలుస్తున్నది జీ!'' అని పిల్చాను. అప్పుడప్పుడూ అలా పిలిస్తే.. ''రమా! నిన్ను కొడతా చూడు!'' అనేది. ఎవరైనా కొడితే మాత్రం మన సహజ లక్షణం మానుకుంటామా ఏంటీ?!

మేము కూడా అప్పుడప్పుడూ వాళ్ల ఊరికి వెళ్లేవాళ్లం. వాళ్లింట్లో గోడకు తెలుపు నలుపులో ఓ పెద్ద ఫొటో ఉండేది. ప్రధాని జవహర్ లాల్ నెహ్రూతో లోక్‌సభ సభ్యులంతా ఉన్న ఫొటో అది. ఇంద్రాణి వాళ్ల నాన్న పెండ్యాల రాఘవరావుగారు మాజీ ఎంపీ అని మాకు అప్పటిదాకా తెలియదు. ఆయన జైలుశిక్ష అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడనీ, కమ్యూనిస్ట్ పార్టీలో చాలాకాలం క్రియాశీలక పాత్ర వహించారనీ, కాంగ్రెస్ నుంచి అప్పట్లో మూడు స్థానాల్లో అసెంబ్లీకి పోటీ చేసి, మూడు స్థానాల్లోనూ గెలిచిన రికార్డు ఆయనదనీ తెలిసి ఆశ్చర్యపోయాం. అయితే ఇప్పటి రాజకీయ నాయకుల్లా ఏమాత్రం పటాటోపం లేకుండా, చాలా మామూలుగా మధ్యతరగతి వాళ్లలాగానే ఉండేది వాళ్లిల్లు. ఇంద్రాణి చెల్లెలు నీహారిణి (రచయిత్రి డా.కొండపల్లి నీహారిణి) నాకు స్కూల్లో జూనియర్. మేము వాళ్లింటికి వెళ్లగానే వాళ్ల నాన్న.. ''నీహా! రమక్క వొచ్చింది. ఇంగ్లీష్, లెక్కలు చెప్పించుకో!'' అనేవారు. మాకేమో ముచ్చట్లు, ఆటలు, పాటలు పేరడీలు కట్టడం, కిసుక్కుమని నవ్వుకోవడాలు ఇష్టం! ఓసారి బయటి నుంచి వాళ్ల నాన్న వచ్చేసరికి.. హడావుడిగా పుస్తకాలు పట్టుకుని ఎవరి ప్రతిభ మేరకు వాళ్లం నటిస్తున్నాం. ఆయన ఒక్క నిమిషం చూసి.. ''ఏం జదువుతున్నావు నీహా?! ఆ పుస్తకమే మంచిగ పట్టుకోలే!'' అన్నారు. తీరా చూస్తే నీహా ఆ తొందరలో పుస్తకాన్ని తలకిందులుగా పట్టుకుని ఉంది. తరువాత బాగా నవ్వుకున్నాం.

ఆ తరువాతి రోజుల్లో వాళ్లు రిక్షాలో కాకుండా బస్సులో వచ్చేవారు. ఓ సారి మేమంతా మాటల సందర్భంలో చేసుకున్న ఒప్పందం ఏమిటంటే.. ఎవరైనా పురుష యువకులు అడిగితే మా అసలు పేరు చెప్పొద్దని! ఆ తరువాత లవ్ లెటర్లూ.. ఆ గోలంతా ఎందుకని చాలాదూరం ఆలోచించాం. మా ఊర్లో ఎవరూ మా జోలికే వచ్చేవారు కాదు పాపం!

ఓసారి ఇంద్రాణి ఒక్కతే బస్సులో వస్తుంటే.. ఎవరో యువకుడు రాడ్ పట్టుకుని, దాదాపు ఆమె మీద పడిపోయినంత వేలాడుతూ.. ''మీ పేరేంది?! ఎక్కడికి పోతున్రు?'' అని అడిగాడట. మా నిర్ణయం గుర్తొచ్చిన ఇంద్రాణి చాలా తెలివిగా ఆలోచించి.. ''లక్ష్మి!'' అని చెప్పిందట. అతను వెంటనే.. ''అవునా! మస్తు కుదిరింది. నా పేరు లక్ష్మీపతి'' అన్నాడట. ఇంతలో మా ఊరు రాగానే ఇంద్రాణి బస్సుదిగి ఇంటికి వచ్చి, మాకు ఈ విషయం చెబితే.. ''నీ అసలు పేరు చెప్తేనే బాగుండె. వాడికి గొట్టుగ ఉండేది!'' అంటూ చాలాసేపు నవ్వాం.

చిన్నపెండ్యాలలో ఇంద్రాణి వాళ్లకు ఒక పిండి గిర్ని ఉండేది. వాళ్లమ్మ పొలం పనుల్లో అజమాయిషీ చేయడానికి పోతే.. వాళ్ల నానమ్మ గిర్నీ నిర్వహించేది. ఇంద్రాణి మా ఇంటికి వచ్చేటప్పుడు వాళ్ల నానమ్మను అడిగి ఓ గుప్పెడు చిల్లర నాణేలు తీసుకొచ్చేది. అప్పుడు బస్ టికెట్ ముప్పై పైసలుండేది. మిగతా పైసలన్నీ ఖర్చు చేసి పల్లీపట్టీలు, పెన్సిళ్లూ లాంటివి కొనుక్కొచ్చేది. తీరా వాళ్ల ఊరికి తిరిగి వెళ్లేటప్పుడు మా అమ్మను ''చిన్నమ్మా! నాకు బస్ చార్జీలు ఇవ్వండి. ముప్పై పైసలు చాలు!'' అని అడిగి తీసుకెళ్లేది. అక్కా, నేనూ, ఇంద్రాణీ కలిసి మా ఊళ్లో రిలీజ్ అయ్యే పాత పాతవీ, కొత్త పాతవీ (డైరెక్ట్ రిలీజ్‌వి కావన్నమాట) సినిమాలు చూసి వచ్చి.. డైలాగులూ, యాక్టింగూ ఇమిటేట్ చేసీ, పాటలు పేరడీలు చేసీ తెగ నవ్వుకునేవాళ్లం.

మా ఊర్లో పదో తరగతి అయిపోగానే అక్కా, ఇంద్రాణీ హనుమకొండ ఉమెన్స్ కాలేజీలో ఇంటర్‌లో చేరారు. వాళ్ల బంధువుల ఇంట్లో తనూ, మా కజిన్ ఇంట్లో అక్కా ఉండేవారు. ఆ సంవత్సరమే వీళ్లకు మరో నలుగురు స్నేహితులు ఏర్పడినా.. అందులో సరోజ, విజయ వీళ్లకు గాఢ స్నేహితులయ్యారు. అంటే కాలక్రమేణా నాక్కూడా అని వేరే చెప్పక్కర్లేదుగా! ఇప్పటికీ ఆ స్నేహం అలాగే కొనసాగుతున్నది. ఇలా ఎన్నో సంఘటనలు ఉన్నాయి గానీ.. మరోసారి చెప్పుకొందాం. ■





నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి